## లైంగిక దాడికి ప్రయత్నించిన మైనర్ బాలుడు అరెస్ట్

పీలేరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్

లైంగిక దాడికి ప్రయత్నించిన మైనర్ బాలుడిని అరెస్ట్ చేసినట్లు రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ అన్నారు. శనివారం స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి ప్రయత్నించిన ఘటనలో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనర్ బాలుడిపై పోక్సో. రేప్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శనివారం పీలేరు అంకాలమ్మ గుడి బాలుడిని అదుపుతీసుకున్నట్లు చెప్పారు. మైనర్ బాలుడిని మదనపల్లె మార్గంలోని తిరుపతి బాల నేరస్తుల కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ యుగంధర్ పాల్గొన్నారు.


ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఆదివారం 22 ఫిబ్రవరి 2026


## పారిశుద్ధంపై అవగాహన పెంచడమే లక్ష్యం

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:

కడప నగరాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా కడప నగర పాలకు సంస్థ ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలో పాత బస్టాండ్ నుంచి సెవెన్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడవద్దని.. క్లాత్ బ్యాగ్ ముద్దని నినాదాలు చేశారు. ఈ ర్యాలీని ఉద్దేశించి కడప కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, ప్రజా వైద్య అధికారి సౌదాగిరి డాక్టర్ రమేష్ లు మాట్లాడుతూ పేరుకు పోతున్న వ్యర్థాలను తొలగించి నగరవాసుల్లో అవగాహన పెంచడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్ స్పెక్టర్లు నాగ సుబ్బయ్య, పూజిత్ రెడ్డి, బాబు, శ్రీనివాసులు, సునీల్, సచివాలయ సెక్రటరీలు ప్రజలు పాల్గొన్నారు.




# స్వచ్ఛ రాజంపేటలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

రాజంపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:

స్వచ్ఛ రాజంపేటలో ప్రజలు భాగస్వామ్యం కావాలని తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు. శనివారం రాజంపేటలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించగా నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. స్వచ్ఛ ర్యాలీలో పాల్గొన్నారు. పాత బస్టాండ్ లో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం ఒక్కో నినాదంతో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని, ప్రజలు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రజల్లో మార్పు వస్తేనే స్వచ్ఛ రాజంపేట సాధ్యమవుతుంది అన్నారు. ప్రతి ఒక్కరూ తమకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంలో ఒక మొక్కను నాటాలని కోరారు. అంతేకాకుండా పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజు ప్రతి ఒక్కరూ కొంత సమయం కేటాయించాలని, అది అలవాటుగా చేసుకోవాలని సూచించారు. అలా చేస్తేనే స్వచ్ఛ రాజంపేట రూపుదిద్దుకోగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మీనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ సీనియర్ నాయకులకు గుగ్గిళ్ల చంద్రమోళి, క్లస్టర్ ఇన్చార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, డాక్టర్ నవీన్ కుమార్, మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కె కరీమ్, తెలుగు యువత అధ్యక్షులు నాగల రమేష్ వార్డ్ ఇంచార్జు అంజిబాబు, చెంగయ్య, రాము యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ ర్యాలీలో పాల్గొన్న జగన్ రాజు, మున్సిపల్ అధికారులు

### మొక్కలు నాటి

# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మొక్కలు నాటుతున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

మదనపల్లె, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుందామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాలు తెలిపారు. శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ డంపింగ్‌యార్డులో జిల్లా కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం మూడవ శనివారం ప్రతి ఒక్కరూ నిర్వహించాలన్నారు. స్వర్ణాంధ్ర కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ తోడ్పాడుతో యజ్ఞంలా చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో మొక్కలు నాటిపారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పట్టణమంతా పరిశుభ్రంగా ఉంచుకొని ప్రతి కుటుంబం నుండి మహిళలు తడి, పొడి చెత్తలను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. మహిళలు పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మెప్మా అధికారి మదసూదన్‌రెడ్డి స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డిఈ శ్రావణి, ఏఈ రవినాయక్, మెప్మా సిఈఓలు భానుప్రకాష్, నాగేంద్ర, ఆర్‌పి రాణి, సచివాలయ వేల్ఫేర్ సెక్రటరీలు పాల్గొన్నారు.

### 23 నుండి ఇంటర్మీడియట్

# పబ్లిక్ థియరీ పరీక్షలు ప్రారంభం

ఎడ్యుకేషన్ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:

ఇంటర్మీడియట్ పబ్లిక్ థియరీ పరీక్షలు (IPE మార్చి-2026) ఈనెల 23వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ పరీక్షలు మార్చి 24వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కడప జిల్లాలో మొత్తం 62 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడనున్నాయి. అని ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి టి.ఎన్.వి. వెంకటేశ్వర్లు తెలిపారు పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించబడతాయని వెల్లడించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయబడింది. నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయబడింది. అలాగే విద్యార్థుల కోసం తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, అవసరమైన వైద్య సహాయం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు తగిన రవాణా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అనుకూల పరిస్థితులు కల్పించబడినట్లు చెప్పారు. ఈసారి ప్రథమ సంవత్సరానికి 17,100 మంది, ద్వితీయ సంవత్సరానికి 16,564 మంది విద్యార్థులు హాజరవుతుండగా, మొత్తం 33,644 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల పర్యవేక్షణ కోసం మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేయడమేకాకుండా, డీఈసీ బృందానికి అదనపు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి సహాయం అవసరమైనా కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08562244171 ను సంప్రదించవచ్చని ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి టి.ఎన్.వి. వెంకటేశ్వర్లు సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకున్నట్లు ఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

### స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో

## లంకమల్లేశ్వర స్వామి దేవస్థానం పరిసరాల శుభ్రత



బద్వేల్, ఫిబ్రవరి 21, ప్రభాత వార్త

స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం భాగంగా శుక్రవారం ఉదయం బద్వేల్ మండలంలోని లంకమల్లేశ్వర స్వామి దేవస్థానం పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమాన్ని బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ. చంద్రమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, లంకమల దేవస్థానం కమిటీ అధ్యక్షుడు మరియు కమిటీ సభ్యులు పాల్గొని దేవాలయ పరిసరాలను పరిశుభ్రంగా మార్చేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమాలను ప్రజలు కూడా సహకరించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఉదయ భాస్కర్ రాజు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల సాధనకు సమరశంఖాన్ని పూరించండి.

మైదుకూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:



పిఆర్‌సి, పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎల సాధన కోసం, మధ్యంతర భృతి 30 శాతం అమలు కోసం ఫిబ్రవరి 25 వ తేదీన ఎస్‌టియు ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు సమర శంఖం పూరించాలని ఎస్‌టియు జిల్లా అడిషనల్ జనరల్ సెక్రటరీ గోశెట్టి రామమోహన్ కోరారు. శనివారం సాయంత్రం కాంప్లెక్స్ సమావేశానంతరం ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ జూలై 2023 నుండి అమలు చేయాల్సిన పిఆర్‌సిని ఇంతవరకు అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. సరెండర్ లీవ్ ఎన్ క్యాష్మెంట్ బకాయిలు నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా చెల్లించలేదన్నారు. అహర్నిశలు సేవలందించిన రిటైర్డు ఉద్యోగులకు పదవీ విరమణ చెందిన మరుసటి రోజునుండే అన్ని రకాల ఆర్థిక బకాయిలు చెల్లించాలని తద్వారా వారి కుటుంబ మనుగడ కోసం ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు టిఈటి పై సరైన నిర్ణయం తీసుకొని ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు మనోవేదన లేకుండా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సూర్యనారాయణ రెడ్డి, దరిశా శ్రీనివాసులు, రాధా నరసింహరాజు, సాధిక్, ఆనంద రావు, వెంకటేష్, ఓబులరెడ్డి, రవీంద్రా రెడ్డి, సురేంద్ర నాయక్, విజయుడు, స్వర్ణలత, మాధవీ లత, భారతి స్వర్ణ లక్ష్మి రమాదేవి, పద్మజ, ధనలక్ష్మి, సునీత, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### వందే భారత్ ఎక్స్‌ప్రెస్ లో ట్రైన్ హోస్టెస్

## ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమం

పీలేరు ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

స్థానిక సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ట్రైన్ హోస్టెస్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని రాధా దేవి నిర్వహించారు. ఈ సందర్భంగా రాధా దేవి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ట్రైన్ హోస్టెస్‌గా పనిచేయడం డిగ్రీ పూర్తి చేస్తున్న యువతకు మంచి అవకాశమని తెలిపారు. ఈ ఉద్యోగానికి అవసరమైన అర్హతలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, గ్రూమింగ్ ప్రమాణాలు మరియు ప్రయాణికులకు అందించాల్సిన సేవల గురించి వివరించారు. ఇంగ్లీష్ మరియు హిందీ భాషలలో మంచి మాట్లాడే నైపుణ్యం, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, సేవాభావం కలిగిన అభ్యర్థులకు ఈ ఉద్యోగంలో మంచి అవకాశాలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ట్రైన్ హోస్టెస్ బాధ్యతల్లో ప్రయాణికులకు సహాయం చేయడం, ఆన్‌బోర్డ్ హాస్పిటాలిటీ నిర్వహణ, రైల్వే సిబ్బందితో సమన్వయం, ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడం వంటి అంశాలు ఉంటాయని వివరించారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఇప్పటి నుంచే తమ కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం మరియు హాస్పిటాలిటీ రంగంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే దరఖాస్తు విధానం, కాంట్రాక్ట్ కాలం, జీతభత్యాలు మరియు భవిష్యత్ వృద్ధి అవకాశాలపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కళాశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇటువంటి ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. మారిన్ని వివరాల కోసం 7207203089 నంబెరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# ఇళ్లలో చోరీలు చేసే నేరస్తుడు అరెస్ట్

- బంగారు ఆభరణాలు, మోటారు సైకిల్ స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:



ఇళ్లలో రాత్రివేళలో చోరీలే లక్ష్యంగా చేసుకొని తాళాలు విరగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బంగారు, ఆభరణాలు, నగదును దొంగలించి, వాటిని సులభంగా అమ్మి డబ్బు సంపాదించేవాడు. కొన్ని సందర్భాల్లో పార్క్ చేసి ఉంచిన మోటారు సైకిళ్లను కూడా చోరీ చేసే షేక్ నౌమాన్ అనే నిందితుడ్ని శనివారం అరెస్టు చేసినట్లు ఏఎస్పీ విబుకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటిలోని చెక్‌పోస్టు ప్రాంతం, వాటర్ ట్యాంక్ సమీపంలో నివాసం ఉన్న ముద్దాయి షేక్ నహాన్ ఎర్రగుంట్ల బైపాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అతన్ని అదుపులోకి తీసుకొని ఒక మోటారు బైక్, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇతను ప్రొద్దుటూరు మరియు ఇతర పట్టణాల్లో పలు ఆస్తి నేరాలకు పాల్పడిన అలవాటుగా నేరాలు చేసే వ్యక్తి అని వెలుగులోకి వచ్చింది. ఇదే విధంగా 2026 జనవరిలో ప్రొద్దుటూరు పట్టణంలోని బాలాజీనగర్-2 ప్రాంతంలో బంగారు నగలు దొంగతనానికి పాల్పడ్డాడన్నారు. ప్రజలు అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కేసు చేధించి ముద్దాయిని అదుపులోకి తీసుకొని దొంగలించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నందుకు ప్రొద్దుటూరు టుటౌన్ పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, రాఘవేంద్రారెడ్డి, మరియు సిబ్బందిని ఏఎస్పీ ప్రశంసించారు.

## భార్య కోసం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం

-పోలీస్‌స్టేషన్ ఎదుట బైటాయింపు

చౌడేపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త



తన భార్యను ఇంకొకరు తీసుకొని వెళ్ళి కాపురానికి రానివ్వకుండా చేస్తున్నాడని భర్త అతని దుకాణం ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, తర్వాత న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ ఎదుట బైటాయించిన సంఘటన శనివారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితుని కథనం మేరకు...చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లికి చెందిన కృష్ణమూర్తితో తమిళనాడు రాష్ట్రం గుడియాత్త రామాలు గాంధీనగర్ లలితతో 17యేళ్ళ క్రితం వివాహమైంది. వారిద్దరికీ ఇద్దరు కుమారులున్నారు. ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి తన భార్యకు మాయమాటలు చెప్పి వలలో వేసుకొని 3యేళ్ళుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారని కృష్ణమూర్తి తెలిపాడు. అయిన తన భార్యను పంపితే బిడ్డల కోసం జీవిస్తామని పలు మార్లు వెళ్ళి బ్రతిమలాడినా వెళ్ళనీయకుండా ధౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయాడు. గ్రామస్తులు పలుమార్లు పంచాయతీలు చేసిన ప్రయోజనం లేకుండా పోవడంతో అతని దుకాణం వద్ద పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి కృష్ణమూర్తి పాల్పడగా కుటుంబ సభ్యులు, దుకాణదారులు అతన్ని కాపాడారు. అయినా తనకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక పోలీస్టేషన్ ఎదుట బైటాయించాడు. వ్యక్తి వల్ల తనకు, కుటుంబ సభ్యులకు ప్రాణహాని వుందనీ, తన భార్యను కాపురానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని బాధితుడు కృష్ణమూర్తి, అత్త కమలమ్మలు పోలీసులతో మొరపెట్టుకొన్నారు. జనసంచారం అధికంగా వున్న ప్రాంతం పెట్రోలు పంపుకు సమీపంలో హఠాత్తుగా కృష్ణమూర్తి ఒంటిపై పెట్రోలు పోసుకోవడంతో అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రజలంతా సంఘటనా స్థలంలో గుమికూడారు.

## తొలగించిన ఆక్రమణలపై అధికారులను నిలదీసిన కౌన్సిల్ సభ్యులు

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 13 11 వార్డుల లోని మురుగునీటి కాలువలపై అవగాహన లేకుండా ఆక్రమణలు తొలగించి ప్రజలను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కౌన్సిల్ సభ్యులు అధికారులను నిలదీశారు. శనివారం మున్సిపల్ ఛైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని 34 అంశాలు, టేబుల్ అజెండా లోని 2 అంశాలతో సభ ప్రారంభం కాగా, అజెండా లోని 26వ అంశము రద్దు చేయగా మరో ఒక అంశము వాయిదా మరో ఆరు అంశాలు గత కౌన్సిల్ సమావేశంలో అజెండాలో రూపొందించారని తిరిగి ఎలా అజెండాకు తెస్తారని రద్దుచేసి మిగిలినవి కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా అజెండా లోని 32వ అంశం కొర్రపాడు రోడ్డు లోని ఈద్గా వద్ద సిసి అప్రోచ్ రోడ్డు, తదితర పనుల కోసం 17.70 లక్షల అంచనా వ్యయంతో అజెండా లో చేర్చడం పట్ల వైస్ చైర్మన్ ఖాజామోహిద్దీన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ముస్లిం కౌన్సిలర్లమంతా పరిశీలించి అక్కడ ఫ్లోరింగ్ లేదా రోడ్డు ఏర్పాటు విషయమై చర్చిస్తామని వివరించారు. కాగా కౌన్సిలర్లు ఇర్ఫాన్ బాష, గరిశపాటి లక్ష్మీదేవి మాట్లాడుతూ తమ వార్డులో కాల్వ ఆక్రమణలు తొలగించారని, కానీ అక్కడ ఏ నిర్మాణాలు చేపడతారు, ఎస్టిమేషన్ వేశారా అని ప్రశ్నించారు. కాగా అధికారులు సమాధానమిస్తూ ఇది కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, సంబంధిత అధికారుల నిర్ణయమని, ఈ విషయమై సోమవారం కమిషనర్ సమాధనమిస్తారని వివరించారు. తమ సర్వేయర్ సర్వే చేసే తొలగించారని, ప్రజల అంగీకారంతో తొలగించామని తెలిపారు. వైస్ చైర్మన్ ఖాజా మోహిద్దీన్ ప్రజలు అంగీకరించిన నేపథ్యంలో నిరసన ఎందుకు తెలుపుతారని ప్రశ్నించారు. వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సోమవారం కమిషనర్ ద్వారా ఎస్టిమేషన్ వేయించి చైర్మన్ ఛాంబర్ కు చేర్చుతామని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్, పార్కింగ్, మీట్, చేపల మార్కెట్ వేలం నిర్వహణ అంశాన్ని చైర్మన్ తెలిపినా ఇంతవరకు ఎందుకు అజెండా లో చేర్చ లేదని వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి అధికారులను ప్రశ్నించగా, అధికారులు సమాధనమిస్తూ కమిషనర్ ఆ అంశంపై పరిశీలించి రానున్న కౌన్సిల్ సమావేశంలో చేర్చుతారని తెలిపారు. కౌన్సిలర్ జిలానీ మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలో వున్న నేపథ్యంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని, దీంతో పాటు షీల్డ్ ను ఎత్తే సమయంలో బ్లీచింగ్ చేయాలని కోరారు. అదేవిధంగా టూటౌన్ బైపాస్ లో టాయిలెట్స్ నిర్మాణానికి టెండర్లు ఎప్పుడు పిలుస్తారని ప్రశ్నించగా అధికారులు మరో వారంలో పిలుస్తామని తెలిపారు.



## కనులవిందుగా సాగిన శ్రీ సీతారాముల కళ్యాణం

గోపవరం ఫిబ్రవరి. 21. ప్రభాతవార్త.



మండల పరిధిలోని రాజుగారి వీధిలో వెలసిన శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం 13వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉదయం ప్రత్యేక అలంకరణ తో భక్తులకు స్వామి వారు దర్శనమిచ్చారు. ఒరుగంటి సీతారామ శాస్త్రి ఆచార్యత్వమున అభిషేకాలు చండీ హోమాలు నిర్వహించారు అనంతరం శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు పూజాకార్యక్రమాలు అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి మేళతళలతో ఘనంగా గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాని ఇంత వైభవంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి దేవస్థానం ధర్మకర్త పూనిపర్తి పెంచల సుబ్బరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి బద్వేల్ ఎమ్మెల్యే సుధా రాణి, బద్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఉమా, జి ఎన్ రమేష్ బాబు, వేణుగోపాల్ రెడ్డి, బంగారు శ్రీను, మాజీ మున్సిపల్ చైర్మన్ చైర్మన్ మునయ్య, పుత్త శ్రీరాములు ఎంఆర్‌ఎఫ్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పరిశుభ్రతే ప్రగతికి సోపానం..

బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 21 ప్రభాతవార్త



మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీడీవో రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం బ్రహ్మంగారిమఠం మండలంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ఎంపీడీవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామచంద్రారెడ్డి జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్, శానిటేషన్, వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. పై కార్యక్రమాల్లో మండల పరిషత్ పరిపాలన అధికారి నరసయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, వెలుగు ఏపీఎం సుబ్బరాయుడు, ఉపాధి ఏపీవో హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, మండల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మార్చి 1 న ప్రాంతీయ సదస్సు జయప్రదం చేయండి

మైదుకూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:



రాయలసీమ జిల్లాల నీటి అవసరాలు రాయలసీమ ఎత్తిపోతల పథకం అవశ్యకత, రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి పై మార్చి 1 న మైదుకూరులో జరుగు ప్రాంతీయ సదస్సు జయప్రదం చేయాలని శనివారం మైదుకూరు పట్టణంలో జరిగిన కరపత్రాల విడుదలలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తర తరాలుగా దగాపడ్డ, వెనకబడ్డ రాయలసీమ నీటి అవసరాల కోసం గొంతెత్తి ప్రశ్నించకపోతే బావితరాలు క్షమించవన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి రామయ్య, పి శ్రీరాములు, ఏ వి శివరామ్, షావల్లి, బి వి సీను, సుబ్బరాయుడు, పీరయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై బి.టెక్ రవి విస్తృత పర్యటన

పులివెందుల , ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :



నియోజక వర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించిన బి.టెక్ రవి శనివారం తొండూరు మండల కేంద్రంలో విస్తృతంగా పర్య టించారు. తెలుగుదేశం పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి మండ లంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో చర్చించారు. మండల కేంద్రం గుండా వెళ్లే నేషనల్ హైవే (ఎన్‌హెచ్) రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన సందర్భంగా, పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, పారదర్శకంగా జరగాలని స్పష్టంగా ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని, కాలనీలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా మురుగు నీటి పారుదల వ్యవస్థను ఆధునీకరించాలని సూచించారు.పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన బి.టెక్ రవి, వారి సమస్యలను విన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, అభివృద్ధి పనుల్లో ఎటువంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాలను స్వచ్ఛంగా ఉంచుదాం

రాజుపాళెం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:



గ్రామీణ ప్రాంతాలను స్వచ్ఛంగా ఉంచుదామని ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛ రథమును ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, జడ్పీ సీఈవో ఓబులమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఎంపీడీవో రామనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మన గ్రామాలలో మనమందరం స్వచ్ఛతను పాటించి మన ఇంటిలో ఉన్న చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామంలోని స్వచ్ఛరథంలో వేసి దానికి సమాన విలువైన నిత్యవసర వస్తువులు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం మన సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో ముందు చూపుతో చేపట్టి చెత్త నుండి సంపద సృష్టించడం మనందరికీ అలవాటు చేస్తున్నారని తెలిపారు. మన మండలంలో 220 కె.వి సబ్ స్టేషన్ ఒకటి ఏర్పాటు చేయుటకు స్థల పరిశీలన చేస్తున్నట్టు తెలిపారు. ఎంపీడీవో రామనాథరెడ్డి మాట్లాడుతూ వావ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పాఠశాల విద్యార్థులకు చెత్త సేకరణ విధానంను అలవర్చి వారి ఇంటిలోని చెత్తను సేకరించి ఆ సంస్థకు అందజేస్తే వారి చదువుకు కావాల్సిన పుస్తకాలు, పెన్నులు పెన్సిళ్లను ప్రోత్సాహంగా ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంనకు హాజరైన వారందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో డిఎల్ డి వో రామాంజనేయులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు మహేశ్వర్ రెడ్డి, కేసి కెనాల్ డిస్ట్రిబ్యూట్ కమిటీ చైర్మెన్ రామచంద్ర రెడ్డి, తాసిల్దార్ మనోహర్ రెడ్డి, ఎంఈఓలు ప్రసాద్, స్వామి రెడ్డి, రూరల్ సీఐ నాగభూషణం ఇతర అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చ

పీలేరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



రాష్ట్రంలోని అనంతపురం, విజయనగరం, గుంటూరు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై జరిగిన దాడులను ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన ప్రత్యక్ష దాడులేనన్నారు. అధికార అహంకారంతో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. భారత జాతి ప్రయోజనాలను కాపాడమంటే పార్టీ ఆఫీసుల మీద దాడులా అని ప్రశ్నించారు. మోదీ దేశాన్ని అమ్ముతున్నాడని విమర్శిస్తే దేశద్రోహమా? మోదీని ప్రశ్నిస్తే దేశాన్ని ప్రశ్నించినట్టా? అని నిలదీశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు అని, ఆ హక్కును అణచివేయడానికి దాడులు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. అనంతపురం, విజయనగరం, గుంటూరు జిల్లాల్లో పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడిన వారిపై తక్షణం క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య విలువలను కాపాడే పోరాటానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో సాగుతున్న ఉద్యమాలకు మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ప్రతిపక్షాలపై దాడులు, బెదిరింపులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నమని, ఇలాంటి చర్యలకు కాలమే సమాధానం చెబుతుందని అన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## 12 వ పి.ఆర్.సి కొరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం

### ఎస్టీయు కడప జిల్లా శాఖ అధ్యక్షుడు సంగమేశ్వర్ రెడ్డి.



వేంపల్లి:ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

12వ పిఆర్సి అమలు కొరకై ఎస్.టి.యు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కడప జిల్లా శాఖ అధ్యక్షుడు సంగమేశ్వర్ రెడ్డి వేంపల్లి లో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం 2024 సాధారణ ఎన్నికల సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు మేనిఫెస్టో ఆధారంగా ఇచ్చిన ఆర్థిక పరమైన హామీల అమలు సాధనకై ఎస్టియు రాష్ట్ర సంఘం గత జనవరిలో ఇచ్చిన మూడు దశల పోరాట శంఖారావం పిలుపుమేరకు ఈనెల 25వ తారీఖున చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేంపల్లి బాలుర ఉన్నత పాఠశాల నందు భోజన విరామ సమయంలో ఉద్యమ శంఖారావ కరపత్రాన్ని మండల ఉపాధ్యాయులు మరియు ఎస్టియు నేతల సమక్షంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా 12వ వేతన సవరణకై ఇప్పటికే 32 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నార, సిపిఎస్ ను రద్దు చేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెడతామన్న హామీ గాలికి వదిలేసారని 34 వేల కోట్ల బకాయిలు ఉద్యోగులకు బాకీ ఉండగా దానికి సంబంధించిన కేటాయింపులు ఈ సంవత్సరం ప్రవేశపెట్టిన బడ్జెట్లో లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ఈ సందర్భంగా ఎస్టియు జిల్లా శాఖ అధ్యక్షులు సంగమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు నాయకులు ధర్మారెడ్డి ప్రతాపరెడ్డి డి సి గోవిందు భాస్కర్ రెడ్డి, లక్ష్మీ నరసింహ, శ్రీనివాసరెడ్డి, జనార్దన్ రెడ్డి, మహబూబ్ బాషా, అమీర్, రాజశేఖర్ రెడ్డి, రాగి సుధాకర్, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ మాసంతో మసీదుల దగ్గర పంచాయతీ సిబ్బంది శుభ్రత చేపట్టాలి

వేంపల్లి:ఫిబ్రవరి 21(ప్రభాత వార్త)



రంజాన్ మాసం ప్రారంభం అయినందున వేంపల్లి మండలంలో ఉన్నటువంటి అన్ని మసీదుల దగ్గర పంచాయతీ సిబ్బంది శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని, అదే విధంగా బ్లీచింగ్ పౌడర్ కూడా వేయాలని ఈవో నాగభూషణ్ రెడ్డిని రహమతుల్లా ఖాన్ కోరడం జరిగింది. ఈవో తక్షణమే స్పందించి తప్పకుండా పనులు చేపడతామని హామీ ఇవ్వడం జరిగింది, రహమతుల్లా ఖాన్ మాట్లాడుతూ వేంపల్లి మండలంలో మసీదుల దగ్గర ఉన్నటువంటి వీధి దీపాలు కూడా మరమ్మతులు చేయించాలని , ప్రతి సంవత్సరం ఇలాగే చేస్తారని ఖాన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కదిరుల్లా, మరియు వైసిపి యువ నాయకులు రాహుల్, మరియు బాబా గౌస్‌లు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి వన్యప్రాణి మృతి

దువ్వూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

మండల పరిధిలోని నీలాపురం అటవీ శాఖ పరిధిలో శనివారం విద్యుత్ తీగలు తగిలి వన్యప్రాణి అయిన అడవి పంది మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి... నీలాపురం ఫారెస్ట్ పరిధిలో ఒక అడవి పంది చనిపోగా అక్కడ కొంతమంది దాని మాంసాన్ని తీసుకొని వెళ్లి పందికి సంబంధించిన నాలుగు కాళ్లు, లివర్ అక్కడే పడవేసి వెళ్లారు. దీంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వనిపెంటకు చెందిన అటవి శాఖ అధికారి చలపతి నాయుడు ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాలకు విద్యుత్ తీగలు వేసి ఉండడం వల్ల అడవి పంది చనిపోయింది అన్నారు. వన్యప్రాణులు, అటవీ మృగాలు మరణిస్తే పొలాల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సంఘటనపై ఆ పొలానికి సంబంధించిన రైతులను విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

## చీఫ్ ఇంజనీర్‌గా రవికిరణ్..

కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



నీటిపారుదుల శాఖ చీఫ్ ఇంజనీరు (ప్రాజెక్ట్) రవి కిరణ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. శనివారం కడపలో ఏపీ ఎన్జీ జీవోస్ జిల్లా అధ్యక్షులు బలపనూరు శ్రీనివాసులు పుష్పగుచ్ఛము ఎన్జీవో డైరీ ఇచ్చి మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు వి. పోల్ రెడ్డి సంయుక్త కార్యదర్శి డి. పద్మనాభరావు ఇరిగేషన్ డిపార్ట్మెంటు అధ్యక్షులు పి. శైలేశ్వర్ రెడ్డి బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్ రాఘవరెడ్డి, పి రామకృష్ణారెడ్డి, అంజాద్, జ్యోతి రెడ్డి,సురేంద్ర ధనరాజు నాలుగవ తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు బి. కాటమయ్య ఉపాధ్యక్షురాలు ఎస్. జానకి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పులివెందుల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :



పులివెందుల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ఆధ్వర్యంలో శనివారం 'ప్రజా దర్బార్' కార్యక్రమం నిర్వహించబడింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఆయనకు నేరుగా వినిపించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సామాన్యులకు న్యాయం చేయడం కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. బాధితుల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని అధికారులకు సూచించారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వాములమవుతామని భరోసా ఇచ్చారు. పాలనను ప్రజల చెంతకు తీసుకెళ్లి పులివెందుల నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని పునరుద్ఘాటించారు.

## చింతకుంటలో స్వచ్ఛ ఆంధ్రస్వర్ణ ఆంధ్ర



దువ్వూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

మండల పరిధిలోని చింతకుంట జిల్లా పరిషత్ హై స్కూల్ నందు శనివారం స్వచ్ఛ ఆంధ్రస్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వెయ్యరాదన్నారు. ప్రస్తుతం మండలంలో స్వచ్ఛ రథం తిరుగుతుందని 15 రోజులకు ఒకసారి ప్రతి పంచాయతీకి వస్తుందని, వచ్చిన సమయంలో తమ ఇంట్లో ఉన్న పాత వస్తువులన్నీ వేస్తే డబ్బులు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి

దువ్వూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

మండల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ లలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు బాగా చదివించి వచ్చే నెలలో జరిగే పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ శంషుద్దీన్ అన్నారు. శనివారం దువ్వూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆయన విద్యార్థులకు అనుకున్న చదువు పట్ల ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. పరీక్షలలో పదవ తరగతి విద్యార్థులకు బాగా చదివించే మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు జరిగే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు ఆవుల శ్రీనివాసులు, వెంకటేశ్వర రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర థీమ్ చెత్త రహిత పరిపాలన



మైదుకూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి నెలలో థీమ్ చెత్త రహిత పరిపాలన అనే విషయంపై మైదుకూరు మండలం లోని అన్ని గ్రామ పంచాయతీల నందు కార్యక్రమం నిర్వహించడం జరిగింది అందులో భాగంగా గంజికుంట గ్రామ పంచాయతీ లెక్కలవారిపల్లె గ్రామం లో జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఎస్.ఏ.ఎస్.ఏ కార్యక్రమం ను నిర్వహించి స్కూల్ పిల్లలకు, పెద్దలకు చెత్త ను తడి చెత్త పొడి చెత్త గా వేరు చేసి చెత్త బండికి అందజేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేయడం జరిగింది. గ్రామ ప్రజలందరూ కూడా వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఇండ్లు, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ ప్రతి ఇంటికి ఒక మొక్కను నాటి భవిష్యత్తు తరాల మంచి ఆరోగ్యకరమైన భవిష్యత్తు ను అందజేయాలని ఇంచార్జీ యంపిడిఓ నాగేంద్ర బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైదుకూరు ఇంచార్జీ ఎంపిడిఓ నాగేంద్ర బాబు మరియు గంజికుంట పంచాయతీ అభివృద్ధి అధికారి మురళీ మోహన్ మరియు సచివాలయం సిబ్బంది హైస్కూల్ హెచ్ఎం నర్సింహులు మరియు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

## హెరిటేజ్‌పై తప్పుడు ఆరోపణలతో నిజాలు మారవు

బద్వేల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త



తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి అంశంపై అసలు విషయాలను పక్కదారి పట్టించేందుకు కొందరు హెరిటేజ్ ఫుడ్స్ సంస్థపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బద్వేల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ,తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి రితీష్ రెడ్డిలు విమర్శించారు. హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ ఎప్పుడూ కూడా తిరుమల తిరుపతి దేవస్థానం కు నెయ్యి సరఫరా చేయలేదని వారు స్పష్టం చేశారు. స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ"క్లీన్ చిట్" అనే పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. లడ్డూ కల్తీ వ్యవహారంలో జరిగిన అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని, మత భావోద్వేగాలను రెచ్చగొట్టి అవినీతి ఆరోపణల నుంచి తప్పించుకోవాలని చూడటం సరికాదని వ్యాఖ్యానించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, నిజాలు ఎప్పటికైనా జరిగిన తప్పులను శాశ్వతంగా దాచలేరని పేర్కొన్నారు.

## ప్రయాణికులకు దొంగతనాలపై అవగాహన

పులివెందుల, ఫిబ్రవరి 21, ప్రభాత వార్త :



పులివెందుల డీఎస్పీ ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూచనలతో ఎస్పై మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్నపల్లి బస్టాండ్ మరియు కడప బస్టాండ్‌లలో ప్రయాణికులకు దొంగతనాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రయాణిస్తున్న ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బస్సుల్లో, బస్టాండ్‌లలో జరిగే జేబుదొంగతనాలు, బ్యాగులు అపహరణ, మోసపూరిత చర్యలపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రయాణ సమయంలో నగదు, బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్లు వంటి విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. తెలియని వ్యక్తులతో అపరిచిత సంబంధాలు పెట్టుకోవద్దని, తమ సామాన్లు ఎప్పటిక ప్పుడు పర్యవేక్షణలో ఉంచాలన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొని ప్రజలకు పాంప్లెట్లు పంపిణీ చేసి చైతన్యం కల్పించారు. ప్రజలు పోలీసుల సూచనలను పాటించి తమ భద్రతకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## చెత్తలేని గ్రామాల దిశగా చర్యలు తీసుకొందాం



చౌడేపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

చెత్తలేని గ్రామాల దిశగా చర్యలు తీసుకొందామని ఎంపిడిఓ లీలామాధవి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్ 2047లో భాగంగా తలపెట్టిన సర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర మేరకు నూతనంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛరథాన్ని స్థానిక పరిపాలనా భవనం వద్ద ప్రారంభించారు. తడిచెత్త, పొడిచెత్తను సేకరించే వాహనాలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటి వద్దకూ వస్తున్నాయన్నారు. అయితే స్వచ్ఛరథం వచ్చినప్పుడు పొడి చెత్తను అందిస్తే అందుకు తగ్గట్టుగా నిత్యావసర సరుకులందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి గృహిణీ వినియోగించుకోవాలన్నారు. అనంతరం స్వచ్ఛరథంపై అవగాహన కల్పించారు. డి.ఎంపిడిఓ మస్తాన్, ఇఓఆర్డీ మహేష్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎంపి, మాజీ మంత్రులను కలసిన పారిశ్రామిక వేత్త

మదనపల్లె, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :



రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను శనివారం పారిశ్రామిక వేత్త కె.అమర్‌నాథ్ కలిశారు. ఈసందర్భంగా ఆయన మదనపల్లెలో నూతనంగా నిర్మించిన తన గృహప్రవేశానికి రావాల్సిందిగా తిరుపతిలోని పెద్దిరెడ్డి నివాసంలో కలసి వారి ఇరువురిని ఆహ్వానించారు. గృహప్రవేశం ఆదివారం జరగనున్నట్లు వారికి ఆహ్వాన పత్రాలను అందజేశారు. అనంతరం టిటిడి మాజీ బోర్డు డైరెక్టర్ పోకల అశోక్‌కుమార్‌ను కూడా గృహప్రవేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. రాజకీయాలకు అతీతంగా టిడిపి, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఆహ్వానించినట్లు అమరనాథ్ తెలిపారు.

## ప్రమాణాలతో దద్దరిల్లిన రాజనాలబండ

చౌడేపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త



మండలంలోని సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండ ప్రమాణాలతో దద్దరిల్లింది. శనివారం శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం పాలకుడైన ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విశేషాభిషేకం, అలంకరణ గావించాడు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిలో కొందరు వాయిదా వేసుకొనగా, మరికొందరు ప్రమాణాలు చేసారు. టిటిడి ఆధ్వర్యంలో స్వామివారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## ఆరోగ్యం-పోషణపై ప్రత్యేక అవగాహన



పెండ్లిమర్రి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఎస్ఈఆర్‌పీ)తో సమన్వయంగా ఫుడ్ బాస్కెట్ మరియు ఎఫ్ఎన్‌హెచ్‌డబ్ల్యూ సమావేశం నిర్వహించడం జరిగింది. మహిళా సంఘ సభ్యులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్ట మేనేజర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యం మరియు పోషణ అంశాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించన ఉత్పత్తులు రసాయన అవశేషాలు లేకుండా ఉండడం వల్ల ఆరోగ్యానికి మేలు చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ నుంచి ఏపీడీ ప్రసాద్, ఐబీ – ఏపీఎం రాధిక, వెంకట సుబ్బమ్మ, డీఎల్ఎంపీ వసంతకుమారిలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పెంపొందించడంతో పాటు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగంపై అవగాహన మరింత పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## వైవీయూ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:



కడప జిల్లాలో ఉన్నత విద్యకు నిలయమైన వైవీయూ అభివృద్ధి చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట అధ్యక్షులు డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం వైవీయూలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైవీయూ నిర్మాణ దశలో ఆగిపోయిన ప్రధాన పరిపాలన భవనం, బిజినెస్ మేనేజ్‌మెంట్ భవనం, ఆసుపత్రి, వర్సిటీ ప్రహరీ గోడలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వైవవీయూలో ఇంజినీరింగ్, ఫార్మసీ, బీఎడ్, లా కోర్సులను ఏర్పాటు చేయాలని ఉమ్మడి సెట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జస్వంత్, బాబు, స్వరూప్ పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకొన్న మనసున్న మా...రాజు..

సుండుపల్లి ,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలకు పొలిమేరపల్లి గ్రామపంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు రెడ్డి శేఖర్ రాజు సహకారంతో ప్రింటర్‌ను రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు, మండల అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు ముఖ్య అతిథులుగా విచ్చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఎల్లప్పుడూ ముందుండాలని వారు పేర్కొన్నారు. ప్రింటర్ వలన విద్యార్థుల మార్కుల పట్టాలు, పరీక్షా పత్రాలు, పరిపాలనా పత్రాలు ముద్రించడంలో సౌలభ్యం కలగడంతో పాటు పాఠశాల పనితీరు మరింత మెరుగుపడుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

## వృషభచలేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయంలో బహిరంగ వేలం..

వేంపల్లి: ఫిబ్రవరి21 (ప్రభాత వార్త)

వృషభ చలేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయములకు పూలమాలలు సప్లై చేయి హక్కునకు మరియు తలనీలాలు పోగు చేసుహక్కు లకు( ఒక సంవత్సర కాలం అనగా01.03.2026 నుండి28.02.2027 వరకు) ఈరోజు అనగా21.02.2026 తేదీ ఉదయం 10 గంటలకు షీల్డ్ టెండర్లు మరియు బహిరంగ వేళమునిర్వహించగా, పూలమాలలు సప్లై చేయి హక్కున కు నలుగురు టెండర్దారులు షీల్డ్ టెండర్లు వేయడం జరిగినది. అందులో మిగిలిన ముగ్గురి కంటే శ్రీ కే విజయకుమార్ కొండవాండ్లపల్లి, చక్రాయపేట మండలం వారు మొత్తము రూ. 810/లకు టెండర్ షెడ్యూల్ నందుకోట్ చేసి, లోయస్టు టెండర్దారునిగా నిలిచారు. తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కు న కుడిపాజిట్లు ఎవరు చెల్లించ నందున వాయిదా వేయడం జరిగినది. సదరు టెండర్ల పర్యవేక్షణకు ప్రొద్దుటూరు డివిజన్ ఇన్స్పెక్టర్ దేవాదాయ శాఖ వారు హాజరయ్యారు. అదేవిధంగా దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ శ్రీ పి వి రమణ పాలక మండలి సభ్యులుకార్యనిర్వహణ అధికారి కడపసుభాష్ మరియు కృష్ణ బలిజ పూసల సంగంమాజీ డైరెక్టర్ కోనేటి నారాయణ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ "వీ" బ్లాకులో స్వచ్ఛదివస్ కార్యక్రమం

కడప, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:

స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో అన్ని శాఖల అధికారులు వారివారి బ్లాకుల వద్ద క్లినింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. శనివారం ఉదయం "వీ" బ్లాకు లోపల, చుట్టూ.. పరిసరాలన్నింటిని ఆయా శాఖల అధికారులు ఆయా వారివారి కార్యాలయాల పరిసరాలలో స్వచ్ఛందంగా పార, పలుగు పట్టి పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో బ్లాకు చుట్టూ పరిసరాలన్నింటిని పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో.. సమాచార పౌర సంబంధాల శాఖ ఎడి పద్మజ, ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది, పిఆర్వోలు, ఇంజనీరింగ్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





**WANTED**

**Skilled:** SC(W) (RCT), SC (W) KDP, OC (Tirumalayapalli), OC(W) (KDP)

**Qualification :** ITI in Electrician.

**Contact :** M/S G.V.RAMANA 9490183662. Sankarapuram, KADAPA.

**CHANGE OF SURNAME**

**Shaik Beebi Sodabandi,** R/at D.No. 3-2-24, Porumamilla Road, Badvel, YSR District, Andhra Pradesh, PIN-516227, hereby declare that I have changed my name from Shaik Beebi (old name) to **Shaik Beebi Sodabandi** (new name).

## విలువల వైతాళికుడు గజ్జెల

వైవీయూ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:




పాత్రికేయ రంగంలో విలువల వైతాళికులు గజ్జెల మల్లారెడ్డి అని తెలంగాణ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్లర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం, గజ్జెల మల్లారెడ్డి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గజ్జెల మల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కార సభ విశ్వవిద్యాలయంలోని అన్నమాచార్య సెనేట్ హాల్లో శనివారం నిర్వహించారు. దినపత్రిక పూర్వ సంపాదకులు కండ్లకుంట శ్రీనివాస్, తెలకపల్లి రవి, సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తిలకు గజ్జెల మల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కారం అందజేసి శాలువ, జ్ఞాపిక, రూ. 50వేల నగదుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ ఆచార్యులు పార్వతి అతిథులను వేదిక మీదికి ఆహ్వానించగా, స్కాలర్లు అతిథుల బయోడేటాను సభ ముందుంచారు. కార్యక్రమంలో డీన్లు ఆచార్యులు అధ్యాపకులు, విద్యార్థులు, సాహితీ ప్రముఖులు రచయితలు పాల్గొన్నారు.

## కోటవీధిలో స్వర్ణాంధ్రస్వచ్ఛంద్ర నిర్వహణ

బద్వేలు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త




పట్టణంలోని కోట వీధిలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర స్వచ్చంద్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ నరసింహారెడ్డి హాజరై మాట్లాడారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. జీరో లిట్టర్ గవర్నెన్స్ ద్వారా రోడ్లు, మార్కెట్లు, ప్రజా ప్రదేశాలు చెత్త రహితంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ వెంకటరామిరెడ్డి, మెప్మా సిఎంఎం కళ్యాణ్ బాబు, సిఓ ప్రసన్న, ఐసిడిఎస్ సూపర్వైజర్, ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ రమణయ్య, ఇంచార్జి టిఓబిఓ నరసయ్య, ఆర్పీలు, ప్రజలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 25న చలో విజయవాడ జయప్రదం చేయండి




మదనపల్లెక్రైమ్ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త.

కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా ఎస్టీయు నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకం శివారెడ్డి, పోకల మధుసూదన మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం దశలవారీగా ఉద్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 25న విజయవాడలో నిర్వహించే మెగా ధర్నాకు జిల్లాలోని ప్రతి మండలం నుండి ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, కడియాల మురళి, రాష్ట్ర కార్యదర్శి మోహన్, రాష్ట్ర నాయకులు వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి మోహన్ కుమార్ రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలుపుదాం

జనసేన నేత మైఫోర్స్ మహేష్

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త.



జనసేన పార్టీ అధినేత పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న "క్రియాశీలక సభ్యత్వ నమోదు మహా యజ్ఞాన్ని" అన్నమయ్య జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ పిలుపునిచ్చారు. శనివారం మదనపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యత్వ నమోదుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మైఫోర్స్ మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో మదనపల్లి జిల్లాను సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో నిలపడమే మన లక్ష్యం కావాలన్నారు. ప్రతి కార్యకర్త ఒక సాధకుడుగా మారి, బాధ్యతగా ఇంటింటికీ తిరిగి సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లి నియోజకవర్గ నేతలు సద్దికూటి హరినాథ్, రెడ్డి మోహన్, శెట్టి రాజేష్, కొట్టాల సురేష్, రాయచోటి నేతలు రమా శ్రీనివాస్, జయరాం, పీలేరు నేతలు నక్క గోపీనాథ్, సుధాకర, మదనపల్లి నేతలు సందీప్ రెడ్డి, చిరంజీవి, సునీత, భారతి మరియు లీగల్ సెల్ ప్రతినిధులు అమర్ నారాయణ, ఉదయ్, జిన్నే రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్న వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

సుండుపల్లె, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :

మండల పరిధిలోని ఎన్ జె ఆర్ కాలనీ ఆరోగ్య పురములో వెలసిన శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి అభిషేకం అనంతరం వస్త్రభరణంపూల అలంకరణ, దీప ధూపం నైవేద్యం సమర్పించడం జరిగినదని, తదుపరి మహా హారతి ఇవ్వడం జరిగినదనియు,తదుపరి మహాగణపతి స్వామి గరుడ స్వామి వారికి ఆంజనేయ స్వామి వారికి తులసి మాతకి ధూప దీప నైవేద్యం సమర్పించి మహా హారతి ఇవ్వడం జరిగినదనియు, వచ్చిన భక్తులకి గోత్రనామాలతో ఆశీర్వద వచనాలు ఇచ్చి తీర్థ ప్రసాదాలు ఇవ్వడం జరిగినది అర్చకుడు అమృనాయక్ తెలియజేసారు.

## తంబళ్లపల్లెలో చెత్త తరలించే వాహనం అవశ్యం

తంబళ్లపల్లె ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ః

నియోజకవర్గ కేంద్రం రెండు సంవత్సరాలుగా అభివృద్ధి దిశగా పయనిస్తోంది. అయితే అందుకు తగ్గట్టు పారిశుధ్య నిర్వహణ పనులు అంతంత మాత్రమే జరుగుతోంది. మండల కేంద్రంలో చెత్త సేకరణకు ఒక ట్రాక్టర్తో పాటు పారిశుధ్య సిబ్బంది కేవలం నలుగురే ఉన్నారు. కేవలం నలుగురు సిబ్బంది పారిశుధ్య పనులు చేయడం కష్ట సాధ్యం. ట్రాక్టర్ సైతం సందు గొందుల్లో వెళ్ళడానికి వీలుపడక మారుమూల వీధుల్లో చెత్త పేరుకు పోతోంది. ప్రతినిత్యం వేల సంఖ్యలో మండల కేంద్రానికి ప్రజలు, అధికారుల రాకపోకలు జరుగుతుంటాయి. జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల పరిషత్ అధికారులు స్పందించి అదనంగా పారిశుద్ధ్య కార్మికులను నియమించి మినీ చెత్త తరలించే వాహనాన్ని ఏర్పాటు చేయకపోతే నియోజకవర్గ కేంద్రం చెత్త కేంద్రంగా మారడం ఖాయం.

## బెటాలియంలో ఉచితంగా దంత వైద్య పరీక్షలు

సిద్ధవటం ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



మండలంలోని భాకరాపేట సమీపాన ఏపీఎస్పీ 11 వ పోలీస్ పటాలయంలోని శ్రీ కోదండరామ కళ్యాణ మండపంలో శనివారం కడప హరిప్రియ డెంటల్ హాస్పిటల్ వారిచే ఉచిత దంత వైద్యశాల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ ఉచితంగా దంత వైద్యశాల ఏర్పాటు చేసి పోలీసులకు దంత చికిత్సలు చేసి మందులు ఇవ్వడం హర్షించదగ్గ విషయమని ప్రతి వ్యక్తి తప్పనిసరిగా దంత పరీక్షలు చేయించుకుని ఆరోగ్య వంతులుగా ఉండాలని తెలిపారు. దంత వైద్యుడు డాక్టర్, గణేష్ మాట్లాడుతూ హరిప్రియ డెంటల్ హాస్పిటల్లో ఎన్టీఆర్ వైద్య సేవా ద్వారా రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు,విశ్రాంతి ఉద్యోగులకు,ఉచిత దంత వైద్యం, సదుపాయాలు కల్పించామని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 131 మందికి దంత పరీక్షలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెడ్ పి రాజశేఖర్, దంత వైద్యులు, విష్ణు ఆర్ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

## పరిశోధనకు ఆధునిక కృత్రిమ మేధస్సు జోడిస్తే ఔషధ రంగంలో అద్భుత ఆవిష్కరణలు

రాజంపేట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

ఔషధ రంగంలో పరిశోధనకు ప్రపంచాన్ని ఆశ్చర్యకితులను చేస్తున్న కృత్రిమ వేదస్సు పరిజ్ఞానాన్ని జోడిస్తే అద్భుత ఆవిష్కరణలు చేయవచ్చని హైదరాబాద్ రెడ్స్ ల్యాబ్ శాస్త్రవేత్త డాక్టర్ జనార్ధన శ్రీకర పేర్కొన్నారు. స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఫార్మసీ కళాశాల నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ పరిశోధన పై ఆధునికత జ్ఞానాన్ని ,ఒక ఔషధాన్ని పలు విధాల ఉపయోగించే మార్గాన్ని సదస్సులోనే పూర్తిగా నేర్చుకోవచ్చున్నారు. అంతేకాకుండా పరిశ్రమలో ఉపయోగించే పరికరాలను కూడా ఆధునిక పద్ధతులను కూడా నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఐపీఎ అధ్యక్షులు డాక్టర్ పి వి నారాయణ ప్రసంగిస్తూ ప్రస్తుత రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఔషధ తయారీ కనుకొనుటలో, అభివృద్ధి సంబంధించిన విషయాలు విద్యార్థి దశ నుండే ఫార్మసీ విద్యను అభ్యసించే వారందరికీ కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై అవగాహన పొందాలని కోరారు. వైస్ చాన్సులర్ డాక్టర్ ఈ.సాయిబాబారెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఔషధ మొక్కల్లో నుంచి వెలికి తీసే ఔషధాలపై వాటి యొక్క ప్రయోగాలపై అదేవిధంగా జంతువుల నుంచి పొంది ఔషధమూలికలపై పరిశ్రమలో ఉత్పత్తి ద్వారా ఔషధాలపై ప్రతిరోజు నూతన ఔషధాలు, వాటి యొక్క సత్ఫలితాలు, దుష్ఫలితాలు అందరూ తెలుసుకోవాలని కోరారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత మాట్లాడుతూ



ఈ సదస్సుకు సుమారు 700 మంది దరఖాస్తు చేసుకోగా 200 మంది పాత్ర ప్రదర్శనతో, వీడియోస్ తో పాల్గొన్న వారందరికీ గొప్ప జ్ఞానాన్ని, వారు తదుపరి విద్యలో అలవర్చుకోవాల్సిన కళా నైపుణ్యాన్ని పెంపొందించుకోవటానికి ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం దీప, డాక్టర్ వాసవి దేవి వై. ప్రదీప్ కుమార్,ఫార్మసీ కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు. జాతీయ సదస్సులో పత్ర ప్రదర్శనలో మొదలగు విభాగాల్లో చక్కటి ప్రదర్శన అందించినందుకు బహుమతులు అందజేశారు.

## డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలి

కాంగ్రెస్పార్టీ సీనియర్ నాయకులు రెడ్డిసాహెబ్

మదనపల్లె, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :




సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసి, యువతను సన్మార్గంలో నడిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డిసాహెబ్ తెలిపారు. శనివారం సిపిఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా, మత్తు పదార్థాల నిర్మూళన కోసం నిర్వహించిన రౌండ్టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలు సేవించడం పట్ల అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. రుషికప్రియ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని మాట్లాడుతూ నాలుగురోజుల క్రితం కలవర్ధన్ గంజాయిమత్తులో చిన్నారిని అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం వీటిని కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మహేష్, విసికే పార్టీ నాయకులు పిటిఎం శివప్రసాద్, నాయిని వారి కుమారి, కరస్పాండెంట్ రమణారెడ్డి, మాలమహానాడు యమలాసుదర్శనం, సిపిఐ క్రిష్ణప్ప, మురళి, ఎస్.కె.బాషా తదితరులు పాల్గొన్నారు.

## 26 నుండి జనసేన సభ్యత్వ నమోదు

రాయలసీమ కోకన్వీనర్ రాందాస్చౌదరి

మదనపల్లె, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

జనసేన పార్టీ ఈనెల 26 నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాయలసీమ కోకన్వీనర్ రాందాస్చౌదరి తెలిపారు. శనివారం కమ్మవీధిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మూడు విభాగాలుగా అవి ఉద్యమి, సాధిక్, ప్రదాతలుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సాదిక్ అనే వ్యక్తి సభ్యత్వ నమోదు చేయు వ్యక్తిగా పిలువబడుతారన్నారు. ఉద్యమి ఎవరైతే జనసేన పార్టీ విధి, విధానాలు, సిద్ధాంతాలు నచ్చి సభ్యత్వం తీసుకుంటారో వారిని ఉద్యమిగా పిలవబడుతారన్నారు. ప్రధాత అనే వ్యక్తి పార్టీకి వెన్నుముకగా, కార్యకర్తలకు అండగా ఉంటూ జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళే వ్యక్తిగా ఉంటారన్నారు. నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు అధికసంఖ్యలో చేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఏఎంసి ఛైర్మెన్ జంగాల శివరామ్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో జిల్లాలోనే మదనపల్లెను అత్యధికంగా చేస్తామన్నారు. సభ్యత్వ నమోదు రూ.400లు పార్టీ నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడపా సురేంద్ర, బాబు, జగదీష్, రెడ్డప్ప, రాజేష్కుమార్, లక్ష్మీపతి, బండి మనోహర్ పాల్గొన్నారు.

## శిక్షణా తరగతులతోనే పార్టీ బలోపేతం

బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పుష్పలత

మదనపల్లె, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు

పార్టీని బూతుస్థాయి నుంచి బలోపేతం చేయడానికి శిక్షణా తరగతులు ఎంతో దోహదపడుతాయని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి గాలి పుష్పలత తెలిపారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో బిజెపి శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండిత్ దీనదయాల్ ఉపాధ్యాయ శిక్షణా మహాభియాన్-2026 శిక్షణా తరగతులు అన్ని మండలాల్లోనూ నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో ఏ విధంగా మనం ముందుకువెళ్లాలో ప్రణాళిక చేయాలన్నారు. జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలోనూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లి నరసింహా రెడ్డి, ఎల్లంపల్లి ప్రశాంత్, నరేంద్రకుమార్రెడ్డి, బండి ఆనంద్, ఓసూరి కిరణ్, ఆకుల క్రిష్ణమూర్తి, పురుషోత్తం, రాందాస్, మోహన్, బాలజ్యోతి, గోపాల్రెడ్డిలు పాల్గొన్నారు.

## నాసిరకంగా రోడ్డు పనులు

పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



పట్టణంలోని బస్టాండ్ సమీపంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఉన్న పంట కాలువను తవ్వి 24 గంటలు గడవక ముందే ఐరన్ రాడ్డులు లేకుండా కాంక్రీట్ వేసి నాసిరకమైన పనులు చేపడుతున్నారని ఆలిండియా హ్యూమన్ రైట్స్ రైట్స్ సెక్రటరీ ఫణి రావు ఆరోపించారు. డ్రైనేజీ కాలువ మరమ్మత్తులు నాసిరకంగా నిర్మిస్తున్న అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. రాత్రి సమయాల్లో పనులు చేయడం ఉదయానికి పూడ్చి వేయడం వంటి పనులు చేస్తున్న అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని వారు ప్రశ్నించారు. అధికారుల పర్యవేక్షణలోనే రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఆయన హెచ్చరించారు.

## గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యం

యర్రగుంట్ల ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:



యర్రగుంట్ల మండల పరిధిలో గల పోట్లదుర్తి పెన్నా నదిలో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు యర్రగుంట్ల సీఐ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. మృతురాలి వయసు సుమారు 30 సంవత్సరాలు ఉంటాయని మృతురాలికి వివాహమైనట్లు తెలుస్తుందని, రెడ్ కలర్ డ్రెస్సు, బ్లాక్ కలర్ లెగ్గిన్ ధరించి ఉందన్నారు. ఆచూకీ తెలిసినవారు యర్రగుంట్ల పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

## స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర

బద్వేల్ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



మండలము తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతినెల మూడవ శనివారము భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆస్పత్రి నందు టాయిలెట్స్ బయో మెడికల్ వేస్టేజ్మెంట్స్ మొదలగు కార్యక్రమం లో మెడికల్ ఆఫీసర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించి అంతర్జాలంలో నమోదు చేయడమైనది. అనంతరం ప్రాథమిక కేంద్రము తొట్టిగారిపల్లి ఆవరణ నందు చెట్లు నాటే కార్యక్రమం చేత ఉద్బుడము మరియు స్వచ్ఛ్ ఆంధ్రపైన ప్రతిజ్ఞ చేసి వైద్య సిబ్బందికి మరియు శానిటేషన్ కార్యకర్తలకు పరిసరాల పరిశుభ్రత పైన తీసుకొనవలసిన జాగ్రత్తలు వ్యక్తిగత పరిశుభ్రతలను పాటించాలని మన ఆరోగ్యం మన చేతిలో ఉంటుందని పేర్కొనడమైనది. అదేవిధంగా పొడి చెత్త తడి చెత్త సేకరించి ఒక పద్ధతిలో చెత్తను మేనేజ్మెంట్ చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది ఎక్కడంటే అక్కడ కాల్చడం వలన వాతావరణము కలుస్తాం చేయకూడదని ప్రజలు ఉద్దేశించి మాట్లాడ మైనది ఈ కార్యక్రమం నందు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రావతి, హెల్త్ అసిస్టెంట్ వి. జనార్ధన్ రావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేయు సిబ్బంది మరియు ప్రజలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నది.

## కార్మికులపై అధికారులు వివక్ష విడనాడాలి

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 21 (ప్రభాతవార్త):




మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న దీక్షలకు సంఘీభావంగా సీఐటీయూ పట్టణ కమిటి నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈమేరకు యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. నాగేంద్రబాబు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు చెత్త పన్ను వసూలు చేశారని విధుల నుంచి తొలగించడం బాధాకరమన్నారు. పారిశుధ్య కార్మికులు సచివాలయ సిబ్బంది. ఇతరశాఖల ఉత్తర్వుల మేరకు పనిచేస్తారనే విషయాన్ని నగర పాలక సంస్థ అధికారులు ప్రజాప్రతినిదులు గ్రహించాలని చెత్త పన్ను వసూళ్లలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సత్యరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు హరి, ఉపాధ్యక్షురాలు దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి పట్ల వైసీపీ నేతల ప్రవర్తన దైవద్రోహం

మదనపల్లి ఫిబ్రవరి 21 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

శాసనమండలిలో వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరుపై రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు,మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, జనసేన రాయలసీమ కో కన్వీనర్ రామదాస్ చౌదరి, తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మదనపల్లిలోని పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శాసనమండలిలో శ్రీవారి చిత్రపటాలను రాజకీయ నిరసనలకు వాడటం అత్యంత బాధాకరం. కాళ్లకు బూట్లు వేసుకుని స్వామివారి ఫోటోలు పట్టుకోవడం హిందూ సమాజాన్ని అవమానించడమే. జగన్మోహన్ రెడ్డి కళ్లలో ఆనందం చూడటం కోసం వైసీపీ నేతలు ఇంతటి నీచానికి ఒడిగట్టారు. మీరు అసలు వెంకటేశ్వర స్వామి భక్తులేనా అని వారు ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం దైవాన్ని ఆయుధంగా వాడుకోవడం మహా పాపమని, ఇలాంటి చర్యలను భక్తులు ఎప్పటికీ క్షమించరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకిరి చైర్మన్ నాగేశ్వర్ నాయుడు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేవరింటి శ్రీనివాసులు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామక్రిష్ణ ఆచారి,,బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి , మదనపల్లి చైర్మన్ జంగాల శివరాం, యల్లంపల్లి ప్రశాంత్,పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు తలారి రాధమ్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వల్లూరి సుమన్ బాబుకు నివాళి నివాళి

నందలూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



సౌమ్య నాథ స్వామి సేవకుడు వల్లూరి సుమన్ బాబు శనివారం అకాల మరణం పొందారు. ఆయన సేవా భావం, భక్తి పరాయణతతో గ్రామంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. దేవాలయ సేవలో చూపిన నిబద్ధతను గ్రామస్తులు స్మరించుకుంటూ సంతాపం వ్యక్తం చేశారు. రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు సుమన్ బాబు నివాసానికి చేరుకుని పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన మృతి సమాజానికి తీరని లోటన్నారు.

## మాతృమూర్తులదే మాతృభాషా రక్షణ బాధ్యత.

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త



పిల్లలకు చిన్న తనం నుండే మాతృభాష పట్ల మమకారం కలిగించడంలో తెలుగు భాష పరిరక్షణలో మాతృమూర్తుల బాధ్యత ఎంతో ఉందని ప్రముఖ సాహితీవేత్త జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా శనివారం ఉదయం 8:30 గంటలకు మునిసిపల్ పార్కులోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రాథమిక స్థాయి వరకు తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని తెలుగు చదివిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అప్పుడే సరైన న్యాయం కలుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల అభివృద్ధి అధికారి నాగ చలపతిరావును సన్మానించారు. ఈ సమావేశంలో కొత్తపల్లి శీను, కంభం పాములేటి బాలగంగాధర్ తిలక్ కాలే దేవానంద్ సుబ్బారాయుడు పాల్గొన్నారు.

## లేగ దూడల యాజమాన్య పద్ధతులపై అవగాహన

సిద్దవటం ఫిబ్రవరి 21 ప్రభాతవార్త



లేగ దూడల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించినట్లు సిద్దవటం పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్. లక్ష్మీదేవి తెలిపారు. జిల్లా లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ (డిఎల్డిఎ) ఆధ్వర్యంలో శనివారం వంతాటిపల్లి గ్రామంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేగ దూడల యాజమాన్య పద్ధతులు, వాటి పోషణ, పెంపకంలో పాటించ వలసిన మెలకువలు రైతు సోదరులకు వివరించామన్నారు. అలాగే వారికి అవసరమైన మందులు నట్టల నివారణ మందులు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ సుధాకర్ రెడ్డి, మాచుపల్లి వెటర్నరీ డాక్టర్ డి. విజయ రాజు, భాకారపేట వెటర్నరీ డాక్టర్ శివశంకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛ రథంను ప్రారంభించిన లతీఫ్ ఖాన్

రామసముద్రం ఫిబ్రవరి 21 ప్రభాతవార్త



గ్రామాలను ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛ రథం' కార్యక్రమాన్ని శనివారం రామసముద్రంలో ఎంపీడీఓ లతీఫ్ ఖాన్ ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ స్వచ్ఛ రథానికి పూజలు చేసి ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి హానికరమని, వాటర్ బాటిళ్లు, పాలిథీన్ సంచులు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు, ఐరన్, అట్టపెట్టెలు వంటి పనికి రాని వస్తువులను రథం ద్వారా ఇంటింటికీ సేకరిస్తామని తెలిపారు. సేకరించిన వ్యర్థాలకు బదులుగా పప్పు, ఉప్పు, చింతపండు, సబ్బులు వంటి నిత్యావసరాలను అందజేసి ప్రజల్లో స్వచ్ఛతపై చైతన్యం కల్పిస్తామన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు గఫూర్, అన్నపూర్ణ, మాజీ సర్పంచ్ బందిలి శివ, పంచాయతీ కార్యదర్శులు, మునిస్వామి నాయక్ మండల సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛత రథాన్ని ప్రారంభించిన అధికారులు

పెద్దమండెం ఫిబ్రవరి 21 ప్రభాతవార్త



ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతారతాన్ని శనివారం మండల అధికారులు ఎంపీడీవో శ్రీధర్ రావు కూటమి నేతలు జిట్టా రమణ రఘురామిరెడ్డి లో జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం పట్టణాలు గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని వ్యక్త పదార్థాలను సేకరించి అందుకు అనుగుణంగా నిత్యవసర వస్తువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు అలాగే ఇంటికి అవసరమయ్యే ప్లాస్టిక్ వస్తువులను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక విధంగా గుజరీ లాగా ఈ ప్రభుత్వం సేకరించి నిత్యవసర వస్తువులుగాని నగదు రూపంలో గానీ చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రతి శనివారం గ్రామంలో వార్తాలను సేకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు కూటమి నేతలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఐక్యత

నందలూరు , ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



మండలంలోని టంగుటూరు గ్రామంలో ఇటీవల మహాశివరాత్రి మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన సందర్భంగా గ్రామస్తులు సోమవారం రాజంపేటకు వచ్చి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వి. అరవిందబాబు, గజ్జల ఈశ్వరయ్య, గుగ్గిళ్ళ మురళీకృష్ణ, మునగా హరికుమార్, మునగ విజయ్ తదితరులు పాల్గొన్నారు. వారు రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజును కలిసి మహోత్సవ విశేషాలను వివరించి, గ్రామంలో నిర్వహించిన రాత్రంతా జాగరణ, రుద్రాభిషేకం, అన్నదాన కార్యక్రమాల గురించి తెలియజేశారు. భక్తుల ఐక్యతతో ఉత్సవం విజయవంతమైందని పేర్కొన్నారు. శ్రీనివాసరాజు గ్రామస్తులను అభినందిస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. భవిష్యత్తులో గ్రామాభివృద్ధి, దేవాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, వినోద్ వర్మ పాల్గొన్నారు.

## 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యం : తహసిల్దార్

పీలేరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



విద్యార్థినులకు సూచనలిస్తున్న తహశీల్దార్

విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని తహశీల్దార్ శివకుమార్ అన్నారు. శనివారం స్థానిక తిరుపతి రోడ్డు ఏపీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. అనంతరం 9,10వ తరగతి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లోకేశ్వరి. ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## యర్రగుంట్లలో జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్ ఏర్పాటు

యర్రగుంట్ల ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ని పరిశుభ్రంగా మార్చే లక్ష్యంతో 'స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర'లో భాగంగా యర్రగుంట్ల రాణివనం నందు శనివారం మున్సిపల్ సిబ్బంది జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించి ప్రజల్లో పారిశుద్ధం పై అవగాహన పెంచేందుకు మున్సిపల్ కార్మికులతో కలిసి కమిషనర్ శేష ఫణి చెత్తాచెదారాల తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మన చుట్టూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం ద్వారా పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గృహాలకు బీమా సౌకర్యం

పీలేరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:



దుశ్శాలువతో సన్మానిస్తున్న దృశ్యం

తపాలా శాఖ పీలేరు సబ్ డివిజన్ ఆధ్వర్యంలో బీమా సంకల్ప్ 3.0 డ్రైవ్లో ఆర్థిక సంవత్సరం డివిజన్ పరిధిలో 250 గృహాలకు బీమా సౌకర్యం కల్పించినట్లు డివిజన్ ఇన్స్పెక్టర్ ఎం. రామమోహన్రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక తపాలాశాఖ కార్యాలయంలో బీమా సంకల్ప్ 3.0 డ్రైవ్ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా సంకల్ప్ డ్రైవ్లో రూ.40 లక్షల ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టించినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూరల్ పోస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద రూ. 1 కోటి నూతన వ్యాపార ప్రీమియం సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

